సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

మంగళవారం । 14 । ఫిబ్రవరి । 2023



కిలో టమాట రూ.20
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్టంగా రూ.22, కనిష్టంగా రూ.4.50, సరాసరిన రూ.10 ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



టన్ను చీనీ @ రూ.34 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.34 వేలు, కనిష్టంగా రూ.14 వేలు, సరాసరిన రూ.18 వేల ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
36.8°/11.2°

జిల్లా పరిధిలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మళ్లీ తగ్గడంతో ఉదయం పూట అక్కడక్కడా చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి



కమాండెంట్ మహేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న పోలీస్ అధికారులు

పుట్టపర్తి అర్బన్: విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలని సదరన్ రీజియన్ హోంగార్డ్ కమాండెంట్ మహేష్‌కుమార్ హోంగార్డులకు పిలుపునిచ్చారు. సోమవారం పుట్టపర్తి సమీపంలోని శిరసాని హిల్స్ పోలీస్ పరేడ్ గ్రౌండులో హోంగార్డ్స్ మొబిలైజేషన్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధుల్లో చేరే సమయంలో తీసుకున్న శిక్షణను మరోసారి గుర్తు చేయడమే కార్యక్రమ ఉద్దేశమని పేర్కొన్నారు. అంతకు ముందు పుట్టపర్తికి విచ్చేసిన కమాండెంట్ మహేష్‌కుమార్‌కు అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన పరేడ్ గ్రౌండ్‌లో హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, హోంగార్డు ఆర్ఐ శ్రీశైలం రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై నేడు సమీక్ష

అనంతపురం అర్బన్: సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్పందన కార్యక్రమంపై అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల అధికారులతో మంగళవారం రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి విజయ కుమార్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ప్రేమ్ చంద్ తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు ఓరియంటేషన్ కార్యక్రమం నగర సమీపంలోని బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు, స్పందన అర్జీల పరిష్కార అంశాలపై రాష్ట్ర ప్రణాళిక శాఖ కార్యదర్శి సమీక్షిస్తారని పేర్కొన్నారు.

ఏమిటీ గందరగోళం?

- వారం వ్యవధిలో రెండు నోటిఫికేషన్లు
- డిగ్రీ పూర్తికి ఎనిమిదేళ్లు గరిష్ట వ్యవధని ఒకసారి..
- కాదు ఆరేళ్లేనంటూ మరోసారి..
- ఆందోళనలో విద్యార్థులు
- ఎస్కేయూ ఉన్నతాధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అధికారులు జారీ చేసిన పరీక్షల నోటిఫికేషన్ డిగ్రీ విద్యార్థులను గందరగోళంలోకి నెట్టింది. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సును ఎనిమిదేళ్లలోపు పూర్తి చేసుకోవాలని ఒకసారి.. కాదు పాత నిబంధనల మేరకు ఆరేళ్లే అని మరోసారి నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో పరీక్షలకు దరఖాస్తు చేసుకునేందుకు ఎవరు అర్హులో.. ఎవరు కారో తెలియక విద్యార్థులు తికమకపడుతున్నారు. స్పష్టత కోసం ఆందోళనకు దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వివరాలిలా ఉన్నాయి. నిబంధనల ప్రకారం డిగ్రీ కోర్సు మూడేళ్లలోపు పూర్తి చేయాలి. ఎవరైనా సబ్జెక్టులు మిగిలితే వాటిని ఆరేళ్లలోపు పూర్తి చేసుకోవచ్చు. అయితే ఎస్కేయూ అధికారులు జనవరి 24న విడుదల చేసిన పరీక్షల నోటిఫికేషన్‌లో ఎనిమిదేళ్లలోపు పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. కోర్సు పూర్తికి నిర్దేశిత కాల వ్యవధిని పెంచారని విద్యార్థులు భావించారు. ఈ మేరకు ఫెయిలై ఎనిమిదేళ్ల లోపు అర్హత ఉన్న బ్యాక్‌లాగ్స్ వారు దరఖాస్తు చేసుకున్నారు.

రెండో నోటిఫికేషన్‌తో అయోమయం

మూడేళ్ల డిగ్రీ కోర్సును ఆరేళ్లలోపు మాత్రమే పూర్తి చేయాలని, అందుకు అర్హులైన వారు మాత్రమే పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ అధికారులు జనవరి 30న రెండో నోటిఫికేషన్ విడుదల చేశారు. తొలి నోటిఫికేషన్‌ను నమ్మి దరఖాస్తు చేసుకున్న వారు.. రెండో నోటిఫికేషన్ చూశాక అయోమయంలో పడ్డారు. తమకు మొదటి నోటిఫికేషన్ మేరకు పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరినా ఉన్నతాధికారులను స్పందించలేదు. దీంతో విద్యార్థులు క్యాంపస్‌లో ఆందోళనలకు దిగుతున్నారు.

న్యాయం చేయాలి

ఎస్కేయూ ఉన్నతాధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఐక్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం యూనివర్సిటీలో ఆందోళన నిర్వహించారు. డిగ్రీ కోర్సును గరిష్టంగా 8 సంవత్సరాల్లోపు పూర్తి చేయాలన్న నిబంధనను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అందరికీ అవకాశం కల్పించేలా మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించి, న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకుడు హేమంత్‌కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు సూర్యచంద్ర యాదవ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహమ్మద్ అబ్బాస్, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వీరేంద్ర, బీఎస్పీ నాయకులు హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పకడ్బందీగా చేపట్టాలి

- డీఏఓ సుబ్బారావు

గాండ్లపెంట: ఈ క్రాప్ నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని డీఏఓ సుబ్బారావు తెలిపారు. సోమవారం మండలంలోని కమతంపల్లి, సామాలగొంది సమీప పొలాల్లో చేపడుతున్న ఈ క్రాప్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు సాగు చేసిన పంటను నమోదు చేసుకోవాలన్నారు. లేకుంటే ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తించవన్నారు. అనంతరం రెక్కమాను రైతు భరోసా కేంద్రాన్ని డీఏఓ సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్‌ను వేగవంతం చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి లక్ష్మీప్రియ, మద్దివారిగొంది సర్పంచ్ నాగభూషణంరెడ్డి, ఏఈఓలు, ఆర్బీకే సిబ్బంది ఉన్నారు.



ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ

ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ఎన్పీకుంట: రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలన్నింటికీ ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని డీఏఓ సుబ్బారావు రైతులకు సూచించారు. సోమవారం ఎన్పీ కుంట, మేకలచెరువు, ఎదురుదోన, పెడబల్లి, పి కొత్తపల్లి ఆర్బీకేలను ఆయన పరిశీలించారు. ఈ–క్రాప్ బుకింగ్‌పై వ్యవసాయశాఖ సిబ్బందికి సూచనలిచ్చారు.

28న జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 28న జగనన్న విద్యాదీవెన పథకం నిధులు విడుదల చేయనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని కళాశాలల అధ్యాపకులు, సంబంధిత అధికారులతో సోమవారం స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంకా అర్హులైన విద్యార్థులు ఉంటే త్వరితగతిన జాబితా సిద్ధం చేయాలన్నారు.ఒక్క విద్యార్థి కూడా నష్టపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు.సమావేశంలో వసతిగృహాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అమ్మవారిని స్పృశించిన సూర్యకిరణాలు



బత్తలపల్లి: స్థానిక లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర ఆలయంలో అమ్మవారిని సోమవారం సూర్య కిరణాలు స్పృశించాయి. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు కేశవస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివమాలధారులు పెద్ద ఎత్తున ఓంకారేశ్వర నినాదాలు చేశారు.

బాధ్యతగా పనిచేయండి

- సచివాలయ ఉద్యోగులకు కలెక్టర్ ఆదేశం



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్

చిలమత్తూరు: 'రాష్ట్ర ప్రభుత్వం సచివాలయాల ద్వారా లక్షల మందికి ఉద్యోగాలు కల్పించింది. వేలకు వేలు జీతాలు ఇస్తోంది. సీఎం నమ్మకాన్ని వమ్ము చేయకుండా బాధ్యతగా ప్రజలకు మెరుగైన సేవలందించాలి' అని కలెక్టర్ బసంత్ కుమార్ సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. పనితీరులో లోపాలుండకూడదని చురకలంటించారు. మండలంలోని దేమకేతేపల్లి, టేకులోడు గ్రామ సచివాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయ భవన నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్యంపై దృష్టి సారించాలన్నారు. సమయ పాలన తప్పనిసరి అన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా పనిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామ్‌కుమార్, సర్పంచ్ తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు

పుట్టపర్తి టౌన్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ఈ నెల 15 నుంచి పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, మడకశిర డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ తెలిపారు. సోమవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. టికెట్టు ఒక్కొక్కరికి రూ. 500 ఉంటుందన్నారు. అలాగే, అతి శీఘ్రదర్శనానికి రూ. 300, శీఘ్రదర్శనానికి రూ. 150 అదనంగా చెల్లిస్తే నేరుగా శ్రీశైలంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు సమీపంలో ఉన్న ఆర్టీసీ బుకింగ్ సెంటర్లు లేదా వెబ్ సైట్ www.apsrtc.onine.in ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చన్నారు.

చిట్టి చేతులు.. అద్భుత ఆవిష్కరణలు

- ఆకట్టుకున్న జిల్లా స్థాయి సైన్స్ ఫేర్
- రాష్ట్రస్థాయి పోటీలకు 10 ప్రాజెక్టులు
- పరిశీలించిన కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: చిట్టి చేతులు అద్భుతాలను ఆవిష్కరించాయి. సోమవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఆవరణలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో నూతన ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. 32 మండలాల నుంచి 132 మంది విద్యార్థులు తమ ఆవిష్కరణలు తీసుకువచ్చి ప్రదర్శించారు. ఇందులో ఉత్తమమైన పది ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి..

నూతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకున్నప్పుడే గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదుగుతారని విద్యార్థులకు కలెక్టర్ బసంత్‌కుమార్ సూచించారు. జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు ఆవిష్కరించిన ప్రాజెక్ట్‌లు ఆలోచింపజేశాయన్నారు. పరిశోధనల వైపు విద్యార్థి దశ నుంచే ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులను అభినందిస్తూ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఈఓ మీనాక్షి, జిల్లా సైన్స్ క్యూరేటర్ ఆనంద భాస్కరరెడ్డి, డీవైఈఓ రంగస్వామి, ఎంఈఓలు వెంకటరమణనాయక్, గోపాల్‌నాయక్, డైట్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్ కరస్పాండెంట్ సురేష్‌కుమార్, జ్యూరీ సభ్యులు జీఎల్ఎన్ ప్రసాద్, సూర్య, నాగిరెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ బసంత్‌కుమార్



చాలా సంతృప్తినిచ్చింది

రైతులకు ఉపయోగపడే పరికరాలను ప్రదర్శించాను. ఇది నాకు చాలా సంతృప్తినిచ్చింది. రాత్రి పూట రైతులు పొలాల్లోకి వెళ్లిన సమయంలో పాములు దగ్గరకు రాకుండా రక్షణ ఇచ్చేలా ఊత కర్రను మా గైడ్ టీచర్ సాయంతో రూపొందించాను. ఒక పైపునకు ఏర్పాటు చేసిన వైబ్రేటర్ వల్ల కింది భాగంలో శబ్ద తరంగాలు వ్యాపించి విషపురుగులు దూరమవుతాయి. దీంతో పాటు పైపు సహాయంతో పిడకలు వేసే మరో పరికరాన్ని తయారు చేశాను.

– సంపత్‌కుమార్, జెడ్పీహెచ్ఎస్, చిలమత్తూరు



వాహనం కదిలితే విద్యుత్ ఉత్పత్తి

రోడ్డుపై వేగంగా వాహనాలు వెళ్లే సమయంలో వ్యాపించే గాలితో విద్యుత్ ఉత్పత్తి చేయడాన్ని మా గైడ్ టీచర్ సాయంతో రూపొందించాను. అతి తక్కువ ఖర్చుతో విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. గాలి వీచడం వల్ల టర్బైన్లు తిరిగి యాంత్రిక శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది. ఇది పర్యావరణానికి హానికరం కాదు.

– వెంకటేష్, జెడ్పీహెచ్ఎస్, రామగిరి

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రొద్దం: మండలంలోని శేషాపురం శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగస్వామి తెలిపిన మేరకు... అందిన సమాచారం మేరకు సోమవారం శేషాపురం శివారులో పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో గుబురు చెట్ల కింద పేకాట ఆడుతున్న ఐదుగురు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.14 వేలు నగదు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీలో మంటలు


లారీ కింద భాగంలో వ్యాపించిన మంటలు

ధర్మవరం అర్బన్: నార్పల నుంచి కర్ణాటకలోని బాగేపల్లికి వరిపొట్టు తరలిస్తున్న లారీలో నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. ధర్మవరంలో ఆదివారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. విషయాన్ని గమనించిన వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం వెంటనే లారీని వెంబడించి అడ్డుకుని, మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సాధ్యం కాకపోవడంతో అగ్నిమాపక సిబ్బందిని రప్పించి మంటలు అదుపు చేయించారు. వరి పొట్టు ఇంజన్‌లోకి వెళ్లడంతో వేడికి మంటలు వ్యాపించినట్లు సీఐ తెలిపారు.

లోక్ అదాలత్ కలిపింది ఇద్దరినీ..

- విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కిన దంపతులు
- మనస్పర్థలు తొలగించి ఏకం చేసిన న్యాయమూర్తి

పావగడ: మనస్పర్థల కారణంగా విడాకులు కోరుతూ కోర్టు మెట్లు ఎక్కిన దంపతులు ఎట్టకేలకు 22 ఏళ్ల తర్వాత ఏకమయ్యారు. ఇందుకు పావగడలోని మున్సిఫ్ కోర్టులో సోమవారం నిర్వహించిన రాష్ట్రీయ లోక్ అదాలత్ వేదికైంది. వివరాలు.. తాలూకాలోని హలిబెట్ట తండాకు చెందిన చిట్టిబాయి, శిరదా నాగరాజు నాయక్ దంపతులు. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు.


జడ్జి సమక్షంలో పూలమాలలు మార్చుకుంటున్న దంపతులు

దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో 22 ఏళ్ల క్రితం ఇద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో పలు మార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయినా దంపతులు కలవలేదు. చివరకు విడిపోవాలని నిర్ణయించుకుని ఏడాదిన్నర క్రితం సీనియర్ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు వాదనలు కొనసాగుతూ వచ్చాయి. ఈ క్రమంలో సోమవారం నిర్వహించిన రాష్ట్రీయ లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.హరిణి చొరవ తీసుకుని దంపతులతో చర్చించారు. ఇద్దరి మధ్య నెలకొన్న మనస్పర్థలకు చక్కటి పరిష్కారం చూపారు. దీంతో ఇద్దరూ ఏకమయ్యేందుకు నిర్ణయించుకున్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విడాకుల నిర్ణయాన్ని రద్దు చేసుకున్న దంపతులను న్యాయమూర్తి అభినందించారు. న్యాయమూర్తి సమక్షంలో దంపతులిద్దరూ దండలు మార్చుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాది యజ్ఞ నారాయణశర్మ, ఎ.ఎస్.రఘునందన్, సిరాజ్ జాఫర్, ప్రభాకరరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

'బెస్ట్'పై చర్యలకు డిమాండ్

గోరంట్ల: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐసీఏఆర్) నుంచి అనుమతులు లేకపోయినా విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న గోరంట్లలోని బెస్ట్ ఇన్నోవేషన్ అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు విజయవాడలోని ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డిని సోమవారం ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం బెస్ట్ యూనివర్సిటీలో అగ్రికల్చర్ నాల్గో సంవత్సరం విద్యార్థి మనోహర్ ఒక్కరోజు ఆలస్యంగా ఫీజు చెల్లించినందుకు ఫెనాల్టీ చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేసిందన్నారు. ఆ డబ్బు చెల్లించకపోవడంతో సెమిస్టర్ పరీక్షకు అనుమతించలేదని, దీంతో మనస్తాపానికి గురైన విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేశాడని వివరించారు. యూజీసీ నిబంధనాలకు విరుద్ధంగా పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు ఎలాంటి మౌలిక వసతులు కల్పించలేదన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న బెస్ట్ యూనివర్సిటీ యాజమాన్యంపై చట్ట పరమైన చర్యలు తీసుకోవడంతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు. ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన వారిలో ఆర్‌యూఏస్ఎఫ్ పిక్కిలి మహేష్, ఎస్ఎస్ఎఫ్ జగన్నాథరెడ్డి తదితరులున్నారు.


ఉన్నత విద్యామండలి చైర్మన్ డాక్టర్ హేమచంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నారాయణ పాఠశాల గుర్తింపు రద్దుకు వినతి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కదిరిలోని నారాయణ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి వంకదారి రాఘవేంద్ర కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుని స్పందన తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనకు వ్యతిరేకంగా విద్యార్థుల నుంచి నారాయణ యాజమాన్యం పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేస్తోందని మండిపడ్డారు. స్టడీ మెటీరియల్‌కు అదనంగా రూ.9 వేల వరకూ వసూలు చేస్తున్నారన్నారు. టెక్నో, ఒలింపియాడ్, నాన్‌టెక్నో పేర్లతో దోపిడీకి తెరలేపారన్నారు. పెట్రోలు బంకు పక్కనే పాఠశాల నిర్వహిస్తుండడంతో ఎప్పుడైనా అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే విద్యార్థులు ప్రాణాలతో బయటపడే అవకాశం కూడా లేదన్నారు. మౌలిక వసతులు ఏమాత్రం లేని ఈ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని గతంలో పలు మార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు ఆసీఫ్, విష్ణు, గురుబాషా, మనోజ్‌యాదవ్, ముబారక్, శ్రీకాంత్, అబూబకర్ పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

నేటి నుంచి రీజనల్ స్థాయి ఎస్పీఎల్

అనంతపురం సప్తగిరి సర్కిల్: 'సాక్షి' మీడియా యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు అనంత క్రీడాగ్రామం వేదికగా రీజనల్ స్థాయి 'సాక్షి ప్రీమియర్ లీగ్' క్రికెట్ పోటీలు జరగనున్నాయి. రాయలసీమ రీజియన్ పరిధిలోని అనంతపురం, వైఎస్సార్, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు చెందిన జట్లు ఈ టోర్నీలో తలపడనున్నాయి. అనంతపురం జిల్లా నుంచి సీనియర్ విభాగంలో ఆర్ట్స్ కళాశాల, జూనియర్ విభాగంలో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. అలాగే వైఎస్సార్ జిల్లా నుంచి సీనియర్ విభాగంలో ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు), జూనియర్ విభాగంలో శ్రీసాయి ఐటీఐ కళాశాల (కడప), తిరుపతి జిల్లా నుంచి సీనియర్, జూనియర్ విభాగాల్లో తిరుపతిలోని సీకామ్ డిగ్రీ, జూనియర్ కళాశాల జట్లు, కర్నూలు జిల్లా నుంచి సీనియర్ విభాగంలో రాయలసీమ యూనివర్సిటీ (కర్నూలు), జూనియర్ విభాగంలో ఈసీఐ ఐటీఐ కళాశాల (నంద్యాల) జట్లు పాల్గొననున్నాయి.

మ్యాచుల వివరాలు ఇలా..

- మంగళవారం ఉదయం 9 గంటలకు సీనియర్ విభాగంలో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి), ఆర్ట్స్ కళాశాల (అనంతపురం) జట్లు తలపడనున్నాయి.
- ఉదయం 11 గంటలకు సీనియర్ విభాగంలో రాయలసీమ యూనివర్సిటీ (కర్నూలు), ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు) జట్లు తలపడనున్నాయి.
- మధ్యాహ్నం 2 గంటలకు జూనియర్ విభాగంలో సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి), ఈసీఐ ఐటీఐ కళాశాల (నంద్యాల) జట్ల మధ్య మ్యాచ్ జరుగనుంది.
- బుధవారం ఉదయం 9 గంటలకు జూనియర్ విభాగంలో జూనియర్ కళాశాల (ఆత్మకూరు), శ్రీసాయి ఐటీఐ కళాశాల (వైఎస్సార్ జిల్లా) జట్లు తలపడనున్నాయి.
- ఉదయం 11 గంటలకు సీనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్ ఉంటుంది.
- మధ్యాహ్నం 2 గంటలకు జూనియర్ విభాగం ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించనున్నారు.

పోలింగ్ కేంద్రాల ఎంపిక

- పట్టభద్ర ఎమ్మెల్సీకి 386 కేంద్రాలు
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 175 కేంద్రాలు

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేశారు. పట్టభద్ర నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు 386 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు 175 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి అనుమతి మంజూరు చేశారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పన పనులను సంబంధిత నోడల్ బృందం పర్యవేక్షిస్తుంది.

ప్రచార ప్రకటనలపై ఎంసీఎంసీ దృష్టి

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ)ని జిల్లా ఎన్నికల అధికారి నియమించారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఇచ్చే ప్రకటనలపై ఎంసీఎంసీ ప్రత్యేక దృష్టి పెడుతుంది. ప్రతిరోజు కమిటీ సభ్యులు సమావేశమై ప్రసారమాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను పరిశీలిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషియల్ మీడియాల్లో ముద్రించే, ప్రసారం చేసే పెయిడ్ న్యూస్ (ఆర్టికల్స్)ను పర్యవేక్షిస్తుంది. అంతే కాకుండా ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు సర్టిఫికేషన్ (ధ్రువీకరణ) ప్రక్రియను ఈ కమిటీ నిర్వర్తిస్తుంది. ప్రకటనలకు 48 గంటల్లో సర్టిఫికేషన్ ఇస్తుంది.


కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్

ఎంసీఎంసీ కమిటీ ఇదే..

ఎంసీఎంసీ (మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ)కి జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ చైర్మన్‌గా ఉంటారు. నోడల్ అధికారిగా డీఆర్వో గాయత్రీదేవి, మెంబర్ సెక్రటరీగా జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి పి.రమేశ్ వ్యవహరిస్తారు. సభ్యులుగా కలెక్టరేట్ ఈ–సెక్షన్ సూపరింటెండెంట్ హరికుమార్, ప్రింట్ మీడియా నుంచి హిందూ జర్నలిస్ట్ ఎస్.రమేష్, హాన్స్ ఇండియా జర్నలిస్ట్ ఆర్.పి. బెంజిమెన్, ఆల్ ఇండియా రేడియో సీనియర్ అనౌన్సర్ జె.శ్యాంసుందర్ ఉంటారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నిఘా

పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల క్రమంలో జిల్లాలో ప్రవర్తనా నియమావళి (కోడ్) అమలులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో ప్రవర్తనా నియమావళిపై ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) కమిటీ నిఘా పెట్టింది. కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదులను వాట్సాప్, జి.మెయిల్ ద్వారానూ పంపించేందుకు అవకాశం కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు		
జిల్లా	పట్టభద్ర	ఉపాధ్యాయ
కర్నూలు	74	27
నంద్యాల	60	30
అనంతపురం	83	33
శ్రీ సత్యసాయి	54	32
వైఎస్సార్	93	38
అన్నమయ్య	22	15
మొత్తం	386	175

ఫిర్యాదులు పంపవచ్చు...

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 08554–220009 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదులు చెప్పవచ్చు. 98499 09062 నంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదులు పంపవచ్చు. ఆన్‌లైన్‌లో nodelofficerMCCatp.gmail.com కు ఫిర్యాదులు పంపవచ్చు.

'పోలీసు స్పందన'కు 23 వినతులు


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి అర్బన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 23 వినతులు అందాయి. ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. చట్టపరిధిలో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణ ప్రసాద్, ఎస్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని చేనేత కార్మికుడి మృతి


నారాయణస్వామి(ఫైల్)

ధర్మవరం: రైలు ఢీకొని చేనేత కార్మికుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీ నివాసి పామాల నారాయణస్వామి (47), లక్ష్మీదేవి దంపతులు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. నారాయణస్వామికి రెండు చెవులూ వినిపించవు. చేనేత కార్మికుడిగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లిన అతను రైలు పట్టాలు దాటుతున్న సమయంలో బెంగళూరు నుంచి వస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొంది. ఘటనలో నారాయణస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని గాజులపల్లి రచ్చకట్టపై ఓ గుర్తు తెలియని యువకుడు (35) అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. సమాచారం అందుకున్న పుట్టపర్తి రూరల్ సీఐ జయానాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఆదివారం రాత్రి నిడిమామిడి నుంచి నడుచుకుంటూ వస్తున్న ఆ యువకుడిని గమనించిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై గాజులపల్లికి చేర్చాడు. మద్యం మత్తులో ఉన్న యువకుడు ఆ రాత్రి రచ్చకట్టపైనే నిద్రించాడు. తెల్లారేసరికి నోట నురుగు కక్కుకుని మృతదేహమై తేలాడు. మృతుడికి బట్టతల ఉందని, టీషర్టు, నైట్ ప్యాంట్ వేసుకున్నాడని, కుడిచేతి మణికట్టుపై ఓం గుర్తు పచ్చబొట్టు పొడిపించుకున్నాడని సీఐ జయానాయక్ తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96837, 94407 96839లో సంప్రదించాలని కోరారు.

వృద్ధురాలి మెడలో గొలుసు అపహరణ


బాధితురాలు గోవిందమ్మ

నల్లచెరువు: మండలంలోని కమ్మవారిపల్లిలో వృద్ధురాలు గోవిందమ్మ మెడలోని బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లారు. సోమవారం వేకువజాము 2 గంటలకు నిద్రలేచిన ఆమె ఇంటి వద్ద ఉన్న బాత్‌రూమ్‌లోకి వెళ్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఆమెను వెనుక నుంచి పట్టుకుని అరవకుండా నోటిలో దుస్తులు కుక్కారు. అనంతరం ఆమె మెడలోని రూ.1.5 లక్షలు విలువ చేసే బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరలక్ష్మి తెలిపారు.

విద్యార్థినుల పట్ల అనుచిత ప్రవర్తన

హిందూపురం: స్థానిక 6వ వార్డులోని యూపీ స్కూల్‌లో పనిచేసే స్వీపర్ బాబు 7వ తరగతి చదివే ఇద్దరు విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తించాడని తల్లిదండ్రులు సోమవారం స్కూల్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం పాఠశాల విద్యార్థులకు యూనిఫారం, బూట్లు అందించారు. ఆ సమయంలో బూట్లు తొడిగించే సమయంలో అనుచితంగా ప్రవర్తించినట్లు బాధిత పిల్లలు తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు సోమవారం ఉదయం స్కూల్ హెచ్ఎంను నిలదీశారు. ఇదే విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వైస్ చైర్మన్ జబీవుల్లాతో ఇంద్రజ స్కూల్‌కు వెళ్లి పిల్లలతో ఆరా తీశారు. స్వీపర్‌పై చర్యలకు సిఫారసు చేయాలని హెచ్ఎంకు సూచించారు.